క్లుప్తంగా

వైభవంగా మహాలక్ష్మమ్మ ఉత్సవాలు



మాట్లాడుతున్న ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు

కావలి రూరల్: పట్టణంలోని ముసునూరులో కొలువై ఉన్న మహాలక్ష్మమ్మ అమ్మవారి ఉత్సవాలను ఈ నెల 22వ తేదీ నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన కుంకుమ పూజతో మొదలు పెట్టి అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి కళకారులతో అమ్మవారి ఊరేగింపు భారీగా ఏర్పాటు చేశామని, ఈ ఉత్సవాలలో ప్రతి ఒక్కరూ పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

డివిజన్‌లో 51.8 మి.మీ వర్షపాతం

ఆత్మకూరు: తుఫాన్ ప్రభావంగా గురు, శుక్ర వారాల్లో గడిచిన 24 గంటల్లో ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 51.8 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయ అధికారులు తెలిపారు. అత్యధికంగా సీతారామపురం మండలంలో 32.2 మి.మీ., ఉదయగిరి 7.8 మి.మీ., ఆత్మకూరు 2.2 మి.మీ., అనంతసాగరం 3.4 మి.మీ., చేజర్ల 1.4 మి.మీ., కలువాయి 2 మి.మీ., మర్రిపాడు 1.4 మి.మీ., ఏఎస్‌పేట 1.4 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైందన్నారు.

వాహనాల వేలం



వాహనాల వేలం నిర్వహిస్తున్న పోలీసులు

సంగం: సంగం పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు శుక్రవారం వేలం పాట నిర్వహించారు. సెబ్ డీఎస్పీ కృష్ణ కిషోర్‌రెడ్డి, సంగం సీఐ రవినాయక్, ఎస్సై నాగార్జునరెడ్డి పోలీస్‌స్టేషన్‌లో 11 వాహనాల్లో 9 వాహనాలకు వేలం పాట నిర్వహించారు. వీటికి రూ.2,48,640 విలువ నిర్ణయించారు. అయితే 30 శాతం అదనంగా రాబడి వచ్చింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొని ద్విచక్ర వాహనాలతో పాటు ఇతర వాహనాలను దక్కించుకున్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు



పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న ఏడీ గురుజయంతి

మర్రిపాడు: మండలంలో 3వ విడత గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు పశుసంవర్ధశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గురుజయంతి పాల్గొని స్వయంగా పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీకాలు వేయడం వల్ల పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ఉండేందుకు వీలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువర్ధకశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతీ పూజ



గొల్లపల్లి పాఠశాలలో సరస్వతీ పూజ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆత్మకూరురూరల్: మండలంలోని గొల్లపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు సరస్వతీ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సరస్వతీదేవి ఆశీస్సులతో విద్యార్థులు బాగా చదువుకుని మంచి మార్కులు సాధించాలని పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసులు విద్యార్థులకు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వరికుంటపాడు: మండలంలోని దీర్ఘకాలిక రోగులు మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యాధికారిణి ఆయేషా అన్నారు. ఆమె శుక్రవారం మండలంలోని సాతువారిపల్లెలో జరిగిన 104 వైద్యసేవల్లో పాల్గొన్నారు. ఆమె 35 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఫ్యామిలీ డాక్టర్‌తో అందించే మెరుగైన వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సావిత్రి,సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చ బంగారానికి చీడ

- మిరపకు తెగుళ్ల బెడద
- వాతావరణ మార్పులతో పెరుగుతున్న చీడపీడలు
- ఆందోళనలో రైతులు



పైరును పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారిణి సుధామయి

కావలి/బిట్రగుంట: కావలి వ్యవసాయ డివిజన్‌లో సాగవుతున్న మిరప పంటలో తెగుళ్ల ఉధృతి అధికంగా ఉంది. వాతావరణ మార్పుల కారణంగా తామర పురుగులు, నల్లి ఉధృతి అధికమై రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రధానంగా తెల్లదోమ, తామర పురుగుల కారణంగా ఆకుముడత తెగులు అధికం కావడంతో నివారణ కోసం ఎన్ని మందులు వాడినా ఫలితం ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. ఆకు ముడత తెగులు కారణంగా దిగుబడి తగ్గిపోవడంతో పాటు పెట్టుబడులు కూడా విపరీతంగా పెరుగుతున్నాయని చెబుతున్నారు.

800 ఎకరాల్లో మిరప సాగు

కావలి వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలోని కావలి రూరల్, బోగోలు, దగదర్తి మండలాల్లో అధికారికంగా 800 ఎకరాల్లో మిరప పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఇది అధికారికంగా సాగు అయినప్పటికీ అదనంగా రెండింతలు అధికంగా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో బంగారం, ప్రియాంక, ఇండామ్‌- 5, తేజా మిరప రకాలను సాగు చేశారు. సాధారణంగా ఈ రకాల దిగుబడి హెక్టార్‌కు 25 టన్నులు రావాల్సి ఉంటుంది. అయితే ఇక్కడి నేలలు, వాతావరణ పరిస్థితులు 15 టన్నులు దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా తోటల్లోని బోర్లు, బావులు కింద సాగవుతున్న మిరప పంటకు ప్రారంభంలో వాతావరణం అనుకూలంగా ఉండడం, అకాల వర్షాలు లేకపోవడంతో దిగుబడులు పెరిగే సూచనలు కనిపించాయి. అయితే కొద్ది రోజుల నుంచి వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకోవడంతో తెగుళ్ల చుట్టుముట్టుతున్నాయి. రాత్రులు మంచు, చలి వాతావరణం, పగలు ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడం వంటి భిన్నమైన పరిస్థితి నెలకొనడంతో పంటపై వాతావరణ ప్రభావం మొదలైంది. ఎక్కువగా తెల్లదోమ, నల్ల తామర పురుగుల వ్యాప్తి కారణంగా ఆకుముడత తెగులు వేగంగా వ్యాపిస్తుంది. ఆకులు ముడుచుకుపోయి మొక్కలు గిడసబారిపోతుండటంతో దిగుబడులు గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. కావలి మండలంలోని తాళ్లపాళెం, రామచంద్రాపురంలో సాగులో ఉన్న మిరపలో ఆకుముడత తెగులు ఉధృతంగా ఉంది. దీని వల్ల దిగుబడిపైనే కాకుండా కాయ నాణ్యత కూడా తగ్గే ప్రమాదం ఉందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సాగవుతున్న మిరప పంటను ఉద్యానవనశాఖాధికారిణి సుధామయి పరిశీలించారు. పంటను ఆశించిన చీడ, పీడల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కలిగిస్తున్నారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

వాతావరణ మార్పుల కారణంగా తెల్లదోమ, నల్ల తామరపురుగుల ఉధృతి పెరిగి మిరపలో ఆకు ముడత తెగులు ఎక్కువగా వ్యాపిస్తున్నట్లు ఉద్యానవనశాఖాధికారిణి సుధామయి తెలిపారు. ఆకులు పైకి ముడుచుకుపోయి మొక్కలు గిడసబారిపోతుంటే నివారణ కోసం ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీ లీటర్లు లేదా స్పినోసాడ్ 0.3 మిల్లీ లీటర్లు లేదా ఫిప్రొనిల్ 2 మిల్లీ లీటర్లు లేదా అసిటమాప్రిడ్ 0.25 మిల్లీ లీటర్లను లీటరు నీటికి కలిపి మార్చి మార్చి పిచికారీ చేయాలని సూచించారు. ఆకులు కిందకు ముడుచుకుపోయి పెళుసుగా మారుతుంటే లీటరు నీటికి ప్రోపర్గిట్ రెండు మిల్లీ లీటర్లు లేదా స్పిరోమేసిఫిన్ ఒక మిల్లీ లీటరు వంతున పిచికారీ చేయాలని సూచించారు. పంటలో ఆకులు కింద ముడత, పైముడత రెండూ కనిపిస్తే లీటరు నీటికి 0.3 మిల్లీలీటర్లు పెగాసిస్ మందును కలిపి పిచికారీ చేయాలన్నారు. తరచుగా లీటరు నీటికి మూడు మిల్లీలీటర్లు వేపనూనె కలిపి పిచికారీ చేస్తున్నా ఫలితం ఉంటుందని వివరించారు.



పూతకు నల్ల తామర పురుగు సోకిన దృశ్యం

విద్యార్థులకు గుణాత్మక విద్యను బోధించాలి



విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలి

ఉదయగిరి: ఉపాధ్యాయులు విద్యార్థులకు గుణాత్మక విద్యను బోధించాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి అన్నారు. ఆయన శుక్రవారం పట్టణంలోని బీసీకాలనీ తెలుగు మీడియం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల హాజరు పట్టీలు, రికార్డులు పరిశీలించారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల పఠన, అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు చదవడం, రాయడం తప్పనిసరిగా వచ్చి ఉండాలన్నారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నాగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి అభినందనలు



చంద్రశేఖర్‌రెడ్డిని భుజాలపైకి ఎత్తుకున్న బీసీ సంఘం నాయకులు

ఆత్మకూరు: తూర్పురాయలసీమ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలుపొందిన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు. ఆత్మకూరుకు చెందిన పలువురు బీసీ సంఘ నాయకులు కౌంటింగ్ కేంద్రం వద్దనే ఉండి ఆయన్ను పూలమాలలతో భుజాలపైకి ఎత్తుకుని సంతోషం వ్యక్తం చేస్తూ అభినందించారు.

పంటల సాగులో మేలైన యాజమాన్యం పాటించాలి



వాశిలిలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూరురూరల్: రైతులు పంటల సాగులో వ్యవసాయశాఖ అధికారుల సూచనలకు అనుగుణంగా మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆత్మకూరు సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ దేవసేనమ్మ అన్నారు. మండలంలోని వాశిలిలో శుక్రవారం నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో రైతులకు పలు అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. ప్రధానంగా వరి సాగులో మిత్ర, శత్రు పురుగులు, ఆవశ్యకత, పురుగు మందులు పిచికారీతో పాటు తక్కువ ఖర్చుతో పంటలకు సమపాళ్లలో పోషకాలు అందించే విధానాలను తెలియజెప్పారు. ప్రస్తుతం పంటలను ఆశిస్తున్న పురుగులు, తెగుళ్ల నివారణకు పాటించాల్సిన పద్ధతులను వివరించారు. ఆత్మకూరు ఏఓ కిషోర్‌బాబు మాట్లాడుతూ ప్రధానంగా వరి సాగులో యాజమాన్య మెళకువలు పాటించడం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునని వివరించారు. కార్యక్రమంలో వాశిలి రైతు భరోసా కేంద్రం వీఏఏ ఈశ్వర్, పొలంబడి రైతులు, స్థానిక వలంటీర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నియంత్రించాలి

కలిగిరి: బాల్యవివాహాల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు పరచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ సామాజిక ఉద్యమకర్త ఎంమాలకొండారెడ్డి తెలిపారు.సిద్ధనకొండూరు ఎస్టీ కాలనీలో బాల్యవివాహ నిషేధ చట్టంపై శుక్రవారం అవగాహన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు నిర్వహిస్తే జరిమానాలు, జైలు శిక్షలు ఉంటాయన్నారు. పోట్లూరి శేషయ్య, రమణమ్మ పాల్గొన్నారు.

మూడు రోజులు అకాల వర్షాలు

చేజర్ల: మూడు రోజుల పాటు వర్షాలు పడుతాయని వాతావరణశాఖ చెప్పుతుండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయశాఖాధికారి శశిధర్ చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కోసిన వరి ధాన్యాన్ని తడవకుండా పట్టలు కప్పి ఉంచాలన్నారు. కోతకు వచ్చిన వరిని వర్షాలు తగ్గిన తర్వాత కోసుకోవాలని తెలిపారు.

అకాల వర్షానికి పంటలకు నష్టం

కలిగిరి: మండలంలో శుక్రవారం కురిసిన అకాల వర్షానికి సాగులో ఉన్న పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో పచ్చిశనగ, వరి పంటలు కోతదశకు వచ్చాయి. వరి పంట పొలాల్లో నెలకొరిగింది. పచ్చిశనగ పంటపై కూడా ఈ వర్షం తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు తెలిపారు. పత్తి తోటల్లో కోతకు వచ్చిన పత్తి కాయలు వర్షానికి పూర్తిగా తడిచిపోయి దెబ్బతిన్నాయి.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



కలిగిరిలో మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ రంగ వరప్రసాద్

కలిగిరి: ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలను వేగవంతంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ ఈఈ రంగవరప్రసాద్ సూచించారు. కలిగిరిలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన వైఎస్సార్ గ్రామీణ్ 2021-22 పథకం ద్వారా మండలంలో 594 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఇప్పటికీ ఇంకా 60 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారన్నారు. వారికి వెంటనే నిర్మాణాలు చేపట్టేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.కళాధర్‌రావు, హౌసింగ్ డీఈ శ్రీనివాసులు, ఏఈ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత తెలుగు క్యాలెండరు ఆవిష్కరణ



త్రైత సిద్ధాంత క్యాలెండరు ఆవిష్కరిస్తున్న సీఐ గిరిబాబు

ఉదయగిరి: శోభకృత్ నామ సంవత్సర త్రైత సిద్ధాంత ఉగాది నూతన క్యాలెండర్‌ను శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ గిరిబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత వక్తలు మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఈ జ్ఞాన తెలుగు క్యాలెండరులో ఎన్నో భగవద్గీత వచనాలు జోడించి ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే విధానంలో రూపొందించామన్నారు. అనంతరం ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డి, ఇస్లాం పీఠాధిపతి ఖాదర్‌బాషా, తదితరులకు వారి క్యాలెండర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో దుత్తలూరు ప్రబోధ సేవా సమితి కమిటీ అధ్యక్షుడు, సభ్యులు జి.ప్రసాద్, జి.సుధాకర్, కె.నరసింహులు, జి.పెంచలరత్నం, వై.మహేంద్ర, నవీన్‌కుమార్, డి.మధు పాల్గొన్నారు.

భార్యాభర్తలు ఘర్షణ

కావలి రూరల్: భార్యాభర్తలు ఘర్షణ పడి వేడి పాలు భార్యపై పోయడంతో తల, శరీరం కాలిన ఘటన శుక్రవారం బుడమగుంట కాలనీలో జరిగింది. కావలి మండలం చిన్నరాముడుపాళెంకు చెందిన శ్రీను, జాలమ్మ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. భర్త శ్రీను ప్రతి నిత్యం మద్యం తాగి గొడవ పడుతుండేవాడు. శుక్రవారం రాత్రి జాలమ్మతో గొడవ పడి వేడి పాలు ఆమె తలపై పోయడంతో తీవ్రంగా గాయపడింది. 108 వాహనం ద్వారా కావలి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారన్నారు.

రైతులు అప్రమత్తం

- ధాన్యం తడవకుండా రక్షణ చర్యలు



బ్రాహ్మణక్రాకలో ధాన్యం తడవకుండా పట్టలు సిద్ధం చేసుకుంటున్న రైతులు

జలదంకి: మండలంలో శుక్రవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి కోతలు జరుగుతున్నాయి. మరి కొందరు వరి కోతల అనంతరం ధాన్యం ఆరబోసుకుని అమ్మేందుకు సిద్ధంగా ఉన్నారు. మండలంలో బ్రాహ్మణక్రాక, చోడవరం, కమ్మవారిపాళెం, గట్టుపల్లి తదితర గ్రామాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు ఆరబోసుకున్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు పట్టలు సిద్ధం చేసుకుంటున్నారు. అయితే వర్షం ఎక్కువైతే ఆరబోసుకున్న ధాన్యం తడిస్తే నష్టపోవాల్సి ఉంటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు సకాలంలో స్పందించి ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలుకు గోతాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

కారు ఢీకొని వ్యక్తి గాయాలు

కావలి రూరల్: చెక్క రిక్షాను కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన శుక్రవారం రాత్రి ముసునూరు వద్ద జరిగింది. ఏరియా వైద్యశాల కానిస్టేబుల్ బాషా సమాచారం మేరకు.. కావలి మండలం చెంచుగానిపాళెంకు చెందిన దద్దాల యానాది కావలిలో చెక్క రిక్షా నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ముసునూరు వద్ద వచ్చే సరికి నెల్లూరు వైపు నుంచి వస్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొనడంతో చెక్కరిక్షా నుజ్జునుజ్జైంది. రిక్షా తొక్కుతున్న దద్దాల యానాదికి తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో కావలి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నైపుణ్యం తప్పనిసరి

- విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ



తమ అనుభవాలను వేదికపై పంచుకుంటున్న విద్యార్థినులు

ఆత్మకూరు: ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై నిరుద్యోగ యువతకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణలో పలు అంశాలపై యువతకు మెళకువలు నేర్పారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల్లో సులభంగా అవకాశాలు దక్కాలంటే నైపుణ్యాభివృద్ధి తప్పనిసరి అని సూచించారు. వర్క్‌వర్స్ సంస్థ సహకారంతో 21వ సెంచరీ బూత్ క్యాంపు ద్వారా పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, ఐటీఐ తదితర విద్యార్థులకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. చదువుల అనంతరం ఉద్యోగావకాశాలు ఏ విధంగా సాధించాలి, పరీక్షలకు, ఇంటర్వ్యూలకు ఎలా సన్నద్ధమవ్వాలనే అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ప్రముఖ కంపెనీ అయిన అగ్రిటెక్, ఫిన్‌టెక్, ఎక్‌టెక్ తదితర కంపెనీలకు చెందిన వివరాలను యువతకు వివరించారు. పోటీ ప్రపంచంలో ఎలా రాణించాలనే అంశాలపై, ఉద్యోగం ఎలా సాధించాలనే విషయంపై రియల్ టైమ్ శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులతో వారి అనుభవాలను, తెలుసుకున్న విషయాలను ప్రజెంటేషన్ ఇవ్వడం వంటివి వేదికపై ప్రదర్శించారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి కుమార్తె అనన్యారెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఈ శిక్షణా కార్యక్రమాలకు సహకారం అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు



రక్తగ్రూపు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల విద్యార్థులు 172 మందికి శుక్రవారం రెడ్‌క్రాస్ సొసైటీ ఉదయగిరి సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కళాశాల డీన్ డాక్టర్ కరుణసాగర్ మాట్లాడుతూ కళాశాలలో ఈ నెల 27న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరం, 28న వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. రక్తదాన శిబిరంలో అధిక మంది యువత పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఉదయగిరి బ్రాంచ్ చైర్మన్ గాజుల ఫారుఖ్‌అలి, మెరిట్స్ కళాశాల ప్రిన్సిపల్ మనోజ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ కళాశాల సిబ్బంది టి.గోపికృష్ణ, డాక్టర్ మిస్గా కృష్ణతేజ, టెక్నీషయన్లు షఫి, రాఫీ, సుధీర్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నేత మృతి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంగం: మండలంలోని జంగాలకండ్రికకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత, సంగం సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యుడు ముత్యాల నాగభూషణం అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై అనారోగ్యం బారిన పడ్డారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు. నాగభూషణం కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఫోన్ చేసి పరామర్శించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతలు గంగపట్నం చంద్రశేఖరయ్య, కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు నాగభూషణం మృతదేహానికి నివాళులర్పించారు.

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

మర్రిపాడు: మర్రిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని ఆత్మకూరు సీఐ నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి 144 సెక్షన్ అమల్లో ఉన్నందున తల్లిదండ్రులు పోలీసులకు సహకరించాలన్నారు. ఆత్మకూరులో నాలుగు పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ఆయన వెంట ఎస్సై విశ్వనాథ్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షకు ఇద్దరు గైర్హాజరు

చేజర్ల: మండలంలోని చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష శుక్రవారం జరిగింది. మొత్తం 61 మంది ఉండగా 59 మంది పరీక్షకు హాజరయ్యారని చీఫ్ ఎగ్జామినర్ టి.శ్రీధర్ తెలిపారు. అత్యంత పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ఆత్మకూరు: ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు శుకవారం ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించారు. పట్టణంలోని 4 పరీక్ష కేంద్రాల్లో పలువురు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షకు 244 మంది హాజరుకావాల్సి ఉండగా 15 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వాసుబాబు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 241 మందికి 11 మంది, షిరిడీ సాయిరాం కళాశాల పరీక్ష కేంద్రంలో 275 మందికి ముగ్గురు, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల కేంద్రంలో 237 మందికి 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డాక్టర్ వాసుబాబు వివరించారు.

ఇంటర్ పరీక్షలకు 25మంది గైర్హాజరు

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ఇంగ్లిష్ పరీక్షకు 25 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్ ఎం.కిరణ్, డిపార్ట్‌మెంటల్ అధికారి నరసింహులు తెలిపారు. పరీక్షలకు మొత్తం 303 మంది విద్యార్థులకు 278 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.

దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి



దంత సంరక్షణపై మాట్లాడుతున్న డాక్టర్ రాధ

చేజర్ల: ప్రతి ఒక్కరు దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని దంత వైద్యురాలు కే రాధ అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని చిత్తలూరు, ఆదూరుపల్లిలోని గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు పంటి సంరక్షణపై పలు సూచనలు చేశారు. ప్రతి రోజూ ఉదయాన్నే బ్రష్‌తో దంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. పొగాకు సంబంధిత పదార్థాలు వాడరాదన్నారు. ఐరన్, కాల్షియం టాబ్లెట్లు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బి శైలజాకుమారి, ఆదూరుపల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం శేషగిరిరావు, ఉపాధ్యాయులు సత్యకుమారి, సుప్రజ, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎన్నాళ్ళకెన్నాళ్లకు..

- ఆర్టీసీ లీజుకు కేటాయింపు
- ఖాళీ స్థలంలో వ్యాపార సముదాయాల ఏర్పాటుకు రంగం సిద్ధం



ముళ్ల పొదలను తొలగిస్తున్న దృశ్యం

ఆత్మకూరురూరల్: మూడు దశాబ్దాలకుపైగా ముళ్ల పొదలతో నిండి పరిసరాలను ఎట్టకేలకు అధికారులు శుభ్రరిచారు. ఆత్మకూరు ఆర్టీసీ డిపోకు చెందిన రెండు ఎకరాలకుపైగా విస్తీర్ణ స్థలం ఉంది. ఈ ప్రదేశానికి చుట్టూ వైద్యశాలలు, విద్యాలయాలు, వ్యాపార భవన సముదాయాలు, వందలాది నివాసాలు ఉన్నాయి. అత్యంత విలువైన స్థలం కీకారణ్యంలా మారింది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా తయారైంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఆర్టీసీ ఈ స్థలాన్ని మూడు భాగాలుగా విభజించి టెండరు ద్వారా 15 ఏళ్ల కాల పరిమితికి లీజు పద్ధతిన వేలం పాటలు నిర్వహించారు. దీంతో ఆర్టీసీ స్థలాన్ని వేలం పాటల ద్వారా దక్కించుకున్న వారు శుక్రవారం ముళ్ల పొదలను జేసీబీ యంత్రాలతో తొలగించే పనులు మొదలు పెట్టారు. ఆత్మకూరులో సువిశాల విస్తీర్ణం కలిగిన ఈ స్థలంలో వాణిజ్య భవన సముదాయాలు, కల్యాణ మండపాలు నిర్మించి నిర్వహించేందుకు వేలం పాటదారులు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ స్థలం సద్వినియోగంలోకి తీసుకురావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా ఆత్మకూరు డిపో మేనేజరు కరీమున్నీసా ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ డిపోకు చెందిన మరో అర ఎకరాకుపైగా స్థలం లీజు ప్రాతిపదికన కేటాయించేందుకు సిద్ధంగా ఉందని ఆసక్తి ఉన్న వారు ఆర్టీసీ నెల్లూరు రీజనల్ కార్యాలయంలోని సంబంధిత విభాగంలో సంప్రదించవచ్చునని తెలిపారు.